క్లుప్తంగా

శబరిమలకు బయలుదేరిన మాలధారులు



పందలపాకలో శబరిమల యాత్రకు బయలుదేరిన స్వాములు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఉన్న మాలధారణ చేసిన అయ్యప్పలు బుధవారం శబరిమాల యాత్రకు బయలుదేరారు. గురుస్వామి తుమ్మూరి వెంకటరమణ ఆధ్వర్యంలో ఇడుముడి కట్టుకుని 18 మంది స్వాములు, మరో 12 మంది గ్రామస్తులు కలిసి యాత్రకు వెళ్లారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి, మీసాల అనిల్‌కుమార్, తుమ్మూరి శివ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మండల దీక్షలు ప్రారంభం



జి.మామిడాడలో మాలధారణ స్వీకరిస్తున్న భక్తులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో మణికంఠస్వామి ఆలయంలో అయ్యప్ప మండల దీక్షలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జి.మామిడాడ గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు అయ్యప్ప మాలధారణ స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణ నంబూద్రి స్వాములకు మాలవేసి దీక్ష ప్రారంభింపజేశారు. ఆలయంలో గురుస్వామి డీఆర్‌కేరెడ్డి మాట్లాడుతూ మాలధారణ గావించిన భక్తులకు ఉచిత అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు ద్వారంపూడి వెంకటకృష్ణారెడ్డి, ద్వారంపూడి యువరాజారెడ్డి, గుండా బత్తుల వీరబాబు, భాస్కరరెడ్డి, మండ రాజారెడ్డి, ఆర్ఏఆర్‌కే చౌదరి, జీబీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆహారాన్ని వృథా చేయరాదు



అచ్యుతాపురత్రయంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు: ఆహారాన్ని వృథా చేయరాదని మండలంలోని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆకలి గురించి అవగాహన కల్పించేందుకు ఐక్యరాజసమితి నిర్వహించే రోజు ఇదే అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని 1979లో యూఎన్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ అధికారికంగా ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలోని ఉపాధ్యాయులు పడాల ఈశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణ సాయి, మహ్మద్ వలీషా తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

పెదపూడి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గండ్రేడులో రూ.26.50 లక్షలతో, జి.మామిడాడలో రూ.60 లక్షలతో, అచ్యుతాపురత్రయంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులపై ప్రజల పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జుత్తుక కృష్ణ, ఆరుమిల్లి సత్యభారతి ప్రసాద్, దత్తుడు, పెండెం అప్పన్న, జుత్తుక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

మధురపూడి: కోరుకొండలోని శ్రీవల్లీ, దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయానికి రూ.9,55,555ను బదిరెడ్డి దొర కుటుంబం అందజేసింది. ఈ నగదును ఆలయ పునఃనిర్మాణానికి గాను దొర తండ్రి బదిరెడ్డి నాగేశ్వరరావు (దొర) జ్ఞాపకార్థం అందజేశారు.

వివాహిత ఆత్మహత్య

రాజానగరం: భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. కొంతమూరు శివారు భవానీపురానికి చెందిన కోడి అమృత వర్షిణి (21), రమేష్ అనే మహేష్‌లు 2019లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. భర్త తప్పతాగి వచ్చి ఆమెను శారీరకంగా, మానసికంగా హింసిస్తుండేవాడు. దీనితో ఆమె చాలాసార్లు పుట్టింటికి వెళ్లి, భర్త మారతాడులే అనే ఆశతో తిరిగి వచ్చేది. అయినా అతనిలో మార్పు మాత్రం వచ్చేది కాదు. ఈ క్రమంలో అతని హింసా ప్రవృత్తి అంతకంతకు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె మంగళవారం రాత్రి ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు ఆమె తండ్రి పిల్లి కుమార్‌స్వామి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మనోహర్ తెలిపారు.

ఆకలి కేకలు

- నూతన మద్యం పాలసీతో తంటా
- ఉపాధి కోల్పోయిన సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్‌లు
- భరోసా కల్పించాలంటున్న కుటుంబాలు

మధురపూడి: కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీ కొందరి పొట్టకొట్టింది.. మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్ మ్యాన్లుగా పనిచేస్తున్న వారికి ఉపాధిని దూరం చేసింది.. గత ప్రభుత్వంలో మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్లుగా చేరి కుటుంబాలను పోషించుకుంటున్న వారి జీవితాల్లో నీళ్ల చల్లింది. వారికి ఆకలి బాధలు తెచ్చింది. కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చి ప్రభుత్వ ఖజానాను నింపుకొంటున్న కూటమి వీరిని అర్ధాంతరంగా తొలగించి ప్రత్యామ్నాయం చూపకుండా గెంటేసింది. ఇప్పుడు ఉపాధి లేక వారు కష్టాలు పడుతున్నారు.

కోరుకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 12 మద్యం షాపులు ఉన్నాయి. ఈ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాలు వస్తాయి. గత ప్రభుత్వం ఎక్కడా అవినీతికి తావులేకుండా ఉండేందుకు సర్కారీ మద్యం దుకాణాలను నిర్వహించింది. అక్కడ సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్లు తదితర సిబ్బంది పనిచేసేలా నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. ఇలా జిల్లాలోని మద్యం షాపుల్లో 500 మంది, కోరుకొండ సర్కిల్‌లో 50 మంది పనిచేశారు. బుధవారం నుంచి వీరిని కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసింది. నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి వీరికి ఉపాధి లేకుండా చేసింది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వీరు ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎక్సైజ్, పోలీసు, వివిధ శాఖలకు చెందిన అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా వారికి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించలేదు. దీని వల్ల ఉపాధి కోల్పోయిన వారు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఉపాధి అవకాశాలు కోల్పోయిన వీరంతా రేపటి నుంచి ఎలా జీవనం సాగించాలనే ఆలోచనలో పడ్డారు. చాలామంది కంటతడి పెట్టుకుంటూ ఎక్సైజ్ అధికారులకు రికార్డులు, స్టాకు వివరాలు అప్పగించారు. ఇక మా తల్లికి వైద్యం చేయించడం ఎలా, పిల్లలకు ఫీజులు ఎలా చెల్లించాలో అంటూ ఇందులో కొందరు మనోవేదనకు గురయ్యారు.



కోరుకొండలోని మద్యం షాపుల్లో పనిచేసిన సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్‌లు

మొండి వైఖరి విడనాడాలి



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి. ఉపాధిని కోల్పోయిన యువత పట్ల మానవతా దృక్పథంతో ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి యువతకు ఉద్యోగాలు చూపించాలి.

– గొల్లపల్లి ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు

ప్రత్యామ్నాయం చూపాలి



నూతన మద్యం పాలసీ ప్రకారం తొలగించిన మాకు ప్రత్యామ్నాయం చూపించాలి. కొంతకాలంగా ప్రభుత్వానికి సేవలందించడంతో పాటు ఆదాయ వనరులను కాపాడామన్న దృక్పథంతో చూడాలి. ఉద్యోగాలు కోల్పోయిన కుటుంబాలకు అండగా నిలవాలి. ప్రభుత్వం మాకు అండగా నిలవాలి.

– ఎస్.పోలరాజు, కోరుకొండ

ఉపాధి కల్పించండి



మద్యం షాపుల్లో పనిచేసిన మాకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఈ విషయమై వివిధ సందర్భాల్లో ఎక్సైజ్, పోలీసు తదితర శాఖలకు చెందిన అధికారులకు వినతి పత్రాలు ఇచ్చాం. మా పట్ల వ్యతిరేక భావాన్ని వీడాలి. కోరుకొండ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో 12 షాపులున్నాయి. ఇక్కడ 50 మంది పనిచేశాం. మా ఆకలి బాధలను అర్థం చేసుకోండి.

– వై.సుబ్బన్న దొర, కోరుకొండ

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం తరలింపు



ఎస్టీ రాజాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు

రంగంపేట: ఖరీఫ్ ధాన్యాన్ని రైతులు తమకు ఇష్టమొచ్చిన రైస్ మిల్లులకు రైతు సేవా కేంద్రాల ద్వారా తరలించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని మర్రిపూడి, ఎస్టీరాజాపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు పంటలను పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ ధాన్యం కోసం రైతులకు కావలసిన గోనె సంచులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులందరూ తమ పంటలను తప్పకుండా నమోదు చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ, పీఎం కిసాన్ లబ్ధిదారుల సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానవన శాఖ ద్వారా శాశ్వత పందిర్లు వేసుకునే రైతులకు 50 శాతం రాయితీ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ పెద్దలు, నాయకులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం సేకరణపై సిబ్బందికి శిక్షణ

పెదపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, కస్టోడెన్ ఆఫీసర్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పౌరసరఫరాల సిబ్బందికి ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి శిక్షణ తరగతులు బుధవారం నిర్వహించారు. ధాన్యం తేమశాతం, ధాన్యం సేకరణ, ప్రమాణాలను ఎలా పాటించాలో సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్ మాట్లాడుతూ మండలంలో 49 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రం ద్వారా రైతులు తాము పండించిన పంటను అమ్ముకోవొచ్చన్నారు. సంచులు, రవాణా చార్జీలు, ధాన్యం సేకరణకు కావలసిన అన్ని పనులను రైతు సేవా కేంద్రం ద్వారా పొందవచ్చన్నారు. ప్రస్తుతం సాధారణ రకం 75 కేజీల బస్తా ధర రూ.1,725, క్వింటాకు రూ.2,300గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసమే ఆహారం

రాజానగరం: మనం తీసుకునే ఆహారం ఆరోగ్యాన్ని పరిరక్షించే విధంగా ఉండాలని గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి అన్నారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రపంచ ఆహార దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆహార భద్రతపై ఐక్యరాజ్య సమితి తీసుకున్న వివిధ విధానాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీ డాక్టర్ హెచ్.సావిత్రి, సీహెచ్ వెంకటేశ్వర్లు, తదితరులు పౌష్టికాహారం ప్రాధాన్యం గురించి వివరించారు.

దుర్గమ్మ సన్నిధిలో అన్నసమారాధన



శ్రీరామనగరం శ్రీకనకదుర్గమ్మ వారి ఆలయం వద్ద అన్నసమారాధన

సీతానగరం: రాపాక పంచాయతీ పరిధి శ్రీరామనగరం శ్రీకనకదుర్గమ్మ వారి ఆలయం వద్ద బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేశారు. సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ తగు చర్యలు తీసుకుంది.

కన్నుల పండువగా దుర్గమ్మ ఊరేగింపు



చక్రద్వారబంధంలో బోనాలు సమర్పిస్తున్న భక్తులు



వెలమపేటలో ట్రాక్టర్‌పై ఊరేగుతున్న దుర్గమ్మవారు

సీతానగరం: స్థానిక వెలమపేటలో దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి సీతానగరం, చినకొండేపూడి, నాగరత్నం కాలనీ, సింగవరం, వంగలపూడిలలో ఊరేగించారు. ఊరేగింపులో కాళికాదేవి శక్తిమూర్తులు, అష్టలక్ష్మీదేవిలు, వివిధ దేవతామూర్తుల వేషధారణలు, అలాగే అగోరా వేషధారణలు ఆకర్షించాయి. బ్యాండ్‌మేళాలు, డప్పుల వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు సాగింది. అనంతరం వంగలపూడి ఇసుక ర్యాంపు వద్ద అమ్మవారి విగ్రహాన్ని గోదావరి జలాల్లో నిమజ్జనం చేశారు.

దేవీమాతకు బోనాల సమర్పణ

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధం దేవీ చౌక్‌లో కొలువైన దేవీమాతకు దసరా ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి చెందిన మహిళలు బుధవారం బోనాలు సమర్పించారు. అనంతరం తీర్థం జరిగింది. ఈ సందర్భంగా జబర్దస్త్ టీమ్ రాజమౌళి, శాంతిస్వరూప్, పవన్‌లు ఆడుతూ, పాడుతూ సందడి చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి పాలకావిళ్లు



పాలకావిళ్లతో ఊరేగింపు నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

రాజానగరం: వెలుగుబందలో వాద్రేవు శ్రీనివాస్‌కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్ప స్వామి పడిపూజ వైభవంగా జరిగింది. అయ్యప్ప స్వామి మాలధారణతో దీక్షలో ఉన్న స్వాములు ఉదయం గణపతి హోమం చేసి, మధ్యాహ్నం సుబ్రహ్మణ్యేశ్వరునికి పాలకావిళ్లు సమర్పించారు. శబరిమలై వెళ్లే భక్తులు పళనిలో చేసే ఈ కార్యక్రమాన్ని తొలిసారిగా స్వాములు పాలకావిళ్లతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం సుబ్రహ్మణ్యేశ్వరునికి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించి, అయ్యప్పస్వామికి పడిపూజ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు బసవ రాంబాబు, కొత్తపల్లి శ్రీనివాస్, వాద్రేవు రమణబాబు, సానేపు రాంబాబు, నున్న రాజా, ముత్యం నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

రాజానగరం: మండలంలోని కానవరానికి చెందిన 10వ తరగతి విద్యార్థి బొర్రా త్రినాథ్ అనే పండు (17) మంగళవారం నుంచి కనిపించడం లేదు. అదే గ్రామంలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్న ఆ విద్యార్థి ముందు రోజు రాత్రి ఇంట్లోనే నిద్రించాడు. బుధవారం ఉదయం కుటుంబ సభ్యుల చూసేసరికి లేడు. చుట్టపక్కల గాలించినా ఫలితం లేదు. ఈ మేరకు అతని చిన్నాన్న బొర్రా సీతారామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై సత్యనారాయణ తెలిపారు.

సమావేశాలకు హాజరుకాకుంటే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

మధురపూడి: మండల పరిషత్ సమావేశానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కాకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశించారు. బుధవారం కోరుకొండ మండల ప్రజా పరిషత్ సమావేశాన్ని ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్యసూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. మండల సమావేశానికి 3 దఫాలుగా రాని అధికారులపై చర్యలుంటాయన్నారు. ఎక్సైజ్, ఫైర్ శాఖలకు చెందిన అధికారులు హాజరుకాకపోవడం పట్ల ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. అనంతరం శాఖల వారీగా సమీక్షించారు. ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు బొరుసు నాగమణి, కొయిడాల స్వర్ణకుమారి, ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్, ఉల్లి బుజ్జిబాబు, తహసీల్దార్ సుస్వాగతం, సర్పంచులు నక్కా రాంబాబు, కడియాల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన శబరిమలైకు..



సింగరాయకొండలో పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

సీతానగరం: ముగ్గళ్లకు చెందిన స్వామి అయ్యప్ప స్వామి మాలాధారణ వేసిన ఆరుగురు భక్తులు కాలినడకన శబరిమలైకు బయలు దేరారు. వీరు బుధవారం ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చేరుకున్నారు. ముగ్గళ్లకు చెందిన గుర్రాల స్వామి, బత్తిన శ్రీను, బోండు భాను, దూలం రమణ, రుద్రం శ్రీను, ఉమ్మిడి బుల్లిరాజులు గత నెల 28న ముగ్గళ్ల నుంచి శబరిమలైకు బయలుదేరారు. వచ్చే నెల 20వ తేదీకి శబరిమలై చేరుకుంటామని వారు తెలిపారు.


వీఓఏలకు శిక్షణ



స్వయం సహాయక సంఘాలతో సమావేశమైన వివిధ శాఖల అధికారులు

రాజానగరం: స్వయం శక్తితో పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ మూర్తి అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో వీఓఏ (విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్)లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల ఏర్పాటుకు, వ్యాపారాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, వాటి ద్వారా వచ్చే ప్రయోజనాలు, సబ్సిడీ వివరాలను వివరించారు. తమ పరిధిలోని స్వయం సహాయక సంఘాలను ఈ మేరకు చైతన్యపరచి, ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రోగ్రామ్ అధికారి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ ఐపీఓ సత్యనారాయణ, ఫుడ్ ప్రాసెసింగ్ అధికారి మాధవి, డీపీఎం హేమంత్, డీఆర్పీ సుకాంత్, ఏపీఎం సునీత, బ్యాంకు మేనేజర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

సినీ బృందం సందడి



విద్యార్థులతో కలసి స్టెప్స్ వేస్తున్న హీరో సుహాస్

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో 'జనకే అయితే గనక' చిత్ర బృందం బుధవారం సందడి చేసింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఇక్కడకు వచ్చిన హీరో, హీరోయిన్లు సుహాస్, సంకీర్తన, డైరెక్టర్ సాకేత్ తదితరులు విద్యార్థులతో కొద్దిసేపు మమేకమయ్యారు. ఈ నెల 12న విడుదలైన ఈ సినిమా అన్నివర్గాలను అలరిస్తూ ప్రేక్షకాదరణ పొందుతున్న తరుణంలో యువత కూడా చూసి ఆదరించాలని కోరారు. సినిమాలోని ప్రత్యేకతలు వివరించారు. విద్యార్థులు వారితో సెల్ఫీలు తీసుకున్నారు.

అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న జంతుశాస్త్రం(జువాలజీ) సబ్జెక్టులో అతిథి అధ్యాపకుడిగా పనిచేయడానికి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జువాలజీ సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. ఈ నెల 19వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పార్కు... రిమార్కు



పార్కులోని కొలనులో పేరుకుపోయిన గుర్రపుడెక్క



ఏబీ నాగేశ్వరరావు పార్కులో చెత్త

- ఉద్యానంలో సమస్యల తిష్ట
- ఆహ్లాదం కోసం వస్తే అనారోగ్యమే

సీటీఆర్ఐ: కాస్త తీరిక దొరికినా.. సరదాగా పిల్లలను ఎక్కడకైనా తీసుకెళ్లాలన్నా.. కాసేపు వాకింగ్ చేయాలన్నా ముందుగా గుర్తొచ్చేది పార్కులే. ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు వెక్కిరిస్తున్నాయి. సమస్యల మాటున కూనరిల్లుతున్నాయి.. ఇక్కడకు ఎందుకు వచ్చామురా బాబూ.. అనేలా దర్శనమిస్తున్నాయి. ఉద్యానాలకు ఉదయం వాకర్స్ నడకకు, సాయంత్రం పిల్లలతో కుటుంబాలు, యువత వస్తుంటారు. కానీ రాజమహేంద్రవరంలోని కొన్ని పార్కులు సమస్యలతో ఆహ్వానం పలుకుతున్నాయి. స్థానిక 39వ డివిజన్‌లోని ఆర్యాపురం వద్ద డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు పార్కు అందుకు నిదర్శనం. ఈ పార్కులోని కొలను మాత్రం ఏడాది పొడుగునా గుర్రపుడెక్కతో నిండి ఉంటుంది. ఎప్పుడో అధికారులకు గుర్తొచ్చినప్పుడు గుర్రపు డెక్కను తొలగిస్తారు. తరువాత అటువైపు చూడరు. ఈ పార్కు రోడ్డును అనుకుని విశాలంగా ఉంటుంది. ఈ సమీపంలో ఆర్యాపురం, తుమ్మలావ, వాంబే గృహాలు తదితర ప్రాంతాల ప్రజలు నివసిస్తుంటారు. చాలా మంది ఈ పార్కుకు సేద తీరాలని వస్తుంటారు. ఇక్కడ కాసేపు కూడా కూర్చోలేని దుస్థితి. గుర్రపుడెక్క ఉండటం వల్ల పార్కులో దుర్గంధం వస్తుంది. పార్కులోనే కాకుండా బయట కూడా ఈ వాసన భరించలేక పోతున్నారు. దీనివల్ల ఇక్కడకు ఎవరూ రావడం లేదు. ఇంత విశాలమైన పార్కును శుభ్రపరిచి ప్రజలకు అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

పార్కులో ఎక్కడ చెత్త అక్కడే ఉంటుంది. దీనికి ప్రధాన కారణం పారిశుధ్య లోపం. నగర పాలక సంస్థ ఆదాయం వచ్చే పార్కులను తప్ప ఇటువంటి పార్కులను పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. ఈ పార్కులో పారిశుధ్యం కొరవడటంతో పాటు ఒకపక్క పిచ్చి మొక్కలు, మరోపక్క చెత్తా చెదారంతో చూడాలంటేనే హడలిపోతున్నారు. కనీసం పారిశుధ్య కార్మికులను పంపి అక్కడ శుభ్రం చేయించాలన్న శ్రద్ధ అధికారులకు లేకుండా పోయింది.

వారికీ ఇబ్బందే..

పార్కులో డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు స్మారక పార్కు ఆవరణలో సీనియన్ సిటిజన్స్ భవనం కూడా ఉంది. ఇక్కడ గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజా సంక్షేమ వేదిక ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. వృద్ధాప్య జీవనం నరకం కాకూడదని, ఆనందంగా ఆత్మ గౌరవంతో సాగాలని, కుటుంబ సంబంధ బాంధవ్యాలు విలువనిచ్చే విధంగా సీనియర్ ప్రతి రోజు కార్యక్రమాలు నిర్వహిస్తారు. కానీ పార్కులో వచ్చే దుర్గంధానికి సాయంత్రం ఒక గంట మాత్రమే ఇక్కడ ఉండగలుగుతున్నారు.

ష్... గంజాయి బ్యాచ్

పార్కు చుట్టూ లైటింగ్ లేకపోవడంతో రాత్రి సమయంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు అడ్డగా మారింది. ఈ పార్కు గోడలు దూకి లోపలకు ప్రవేశిస్తూ నానా హంగామా చేస్తున్నారు. తాగి పడేసిన మద్యం సీసాలతో ఉదయం పార్కు అస్తవ్యస్తంగా కనిపిస్తుంది. అక్కడకు వెళ్లి చూసుకోకుండా కాలు వేస్తే పగిలిన మద్యం సీసాలు గుచ్చుకుంటున్నాయని పలువురు వాపోతున్నారు. రాత్రిళ్లు పోలీసుల గస్తీ లేకపోవడంతో వీరి ఆగడాలకు అంతులేకుండా పోయింది. అంతేకాకుండా ఒక్కోసారి మద్యం తాగుతూ ఇక్కడ చిందులు వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కార్పొరేషన్, పోలీసు అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.